తగలబెడితే.. తంటాలే

● వరి కొయ్యకాలను కాల్చొద్దు.. నేలలో కలియదున్నాలి ● రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కోనరావుపేట, మే 19: అన్నదాతలు పూర్వం వరిచేళ్లను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అప్పట్లో పశువులు ఎక్కువగా.. వరి సాగు తక్కువగా ఉండడంతో పశుగ్రాసం కుప్పలుకుప్పలుగా పెట్టుకునేవారు. ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. యంత్రాలను విరివిగా ఉపయోగించడంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. హార్వెస్టర్‌తో కోయించడంతో కొయ్యకాలు మిగిలిపోతున్నాయి. దీంతో రైతులు కొంతమేర గడ్డిని తెచ్చుకోగా, మిగిలినది అక్కడే వదిలివేస్తున్నారు. పొలం దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా ఉంటుందని కొందరు కొయ్యకాలును కాల్చివేస్తున్నారు. కొయ్యకాలు కాలిస్తే సూక్ష్మపోషకాలకు చేటు జరుగుతుందని, వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందని.. నేలలో కలియదున్నితే రైతులకు మేలు.. అంటూ వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులు క్షేత్రస్థాయి లో అవగాహన కల్పిస్తున్నారు.



నిజామాబాద్ గ్రామంలో వరి కొయ్యలను కాల్చుతున్న రైతులు

భూమికి అపార నష్టం..

వరికొయ్యలను కాల్చడం ద్వారా అపార నష్టం వాటిల్లుతున్నది. భూసారం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదమున్నది. మంటల ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ వంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగ్గుబడి తగ్గిపోతున్నది. అంతేకాకుండా భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. అలాగే పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉన్నది. ఒక్కోసారి గాలులకు మంటలు అధికంగా వ్యాపించి రైతులు సైతం ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. పొలాల్లో వ్యవసాయ సామగ్రి ధ్వంసమయ్యే ప్రమాదమున్నది. రైతులు కొయ్యకాలును కాల్చడం పూర్తిగా మర్చిపోవాలి.

ఇలా చేస్తే అధిక ప్రయోజనాలు

కొయ్యకాలు నేలలో కలియదున్నడంతో సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు ఐదు నుంచి పది శాతం పెరిగే అవకాశమున్నది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మునిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.

కలియ దున్నితే మేలు..

కొయ్యకాలు కలియదున్నితే పొలాల్లో మొక్కలకు రెండు శాతం నత్రజని (యూరియా), నాలుగు శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు మేలు చేకూర్చుతాయి. నేలలో కరుగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతుంది.

కాల్చొద్దు.. కలియ దున్నాలి

వరి కోతలు పూర్తి కావస్తున్నాయి. ఈ నేపథ్యంలో పొలాల్లోని కొయ్యలను తగలబెట్టకుండా కలియదున్నడం ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. కొయ్యకాలుకు నిప్పుపెట్టడం ద్వారా గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. దున్నేముందు తప్పని సరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి తొందరగా కుళ్లిపోయి ఎరువుగా మారి దిగుబడి పెరుగుతుంది. ప్రతి క్లస్టర్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకట్రావమ్మ, వ్యవసాయాధికారి (కోనరావుపేట)

అ'పూర్వ' సమ్మేళనం

కనగర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోనరావుపేట, మే 19: కనగర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికలో చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరూ యోగక్షేమాలు తెలుసుకుని సంబురంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, మే 19: పోతిరెడ్డిపల్లి, కోరుట్లపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తేనె పెంపకంపై అవగాహన

వేములవాడ రూరల్, మే 19: మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేములవాడ మండలం రుద్రవరంలో ఆదివారం తేనె పెంపకం, ఇతర ఉపాధి కల్పనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సభ్యుడు ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, డీఎస్పీ నాగేంద్రాచారి ఆధ్వర్యంలో ముంపు గ్రామాల్లో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మిత్ర ఫౌండేషన్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, నాయకులు ఊరడి రాంరెడ్డి, కనకయ్య, భూమయ్య, మహేశ్, కనకరాజు, తిరుపతి, హరికృష్ణ, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు

నేటి నుంచి క్రీడా పోటీలు

రుద్రంగి, మే 19: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ అశోక్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉదయం 8గంటలకు కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు తమ టీమ్‌తో సకాలంలో హాజరు కావాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన రెండు జట్లకు జిల్లా స్థాయిలో అవకాశం కల్పిస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, మే 19: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 25 వరకు నిర్వహించే క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రాజుగౌడ్ ఆదివారం ఒక ప్రటనలో సూచించారు. మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో అన్ని గ్రామాల క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ విఫలం

ఇల్లంతకుంట, మే 19: ధాన్యం కొనుగోళ్ల సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బుర్ర సూర్యాగౌడ్ ఆదివారం విమర్శించారు. అకాల వర్షాలు పడుతున్నా.. కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడం లేదని మండిపడ్డారు. ధాన్యం తడవడంతో అన్నదాతలు ఇబ్బందిపడుతున్నా.. స్థానిక ఎమ్మెల్యేపట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టకాలం వచ్చిందని వాపోయారు. ఇప్పటికైనా కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు.

తంగళ్లపల్లిలో హెల్త్ క్యాంపు

సిరిసిల్ల రూరల్, మే 19: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం భవన నిర్మాణ, కార్మిక శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. భవన నిర్మాణశాఖ కార్డు కలిగిన అభ్యర్థులకు రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి శాంపిల్ తీసుకున్నారు. ఇక్కడ క్యారం జగత్, విశ్వనాథుల రమేశ్, తెంబరవేని శ్యామ్, తదితరులు ఉన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

సిరిసిల్ల రూరల్, మే 19: మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన చౌకి వరలక్ష్మి(75) కొన్ని నెలల క్రితం తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని అమ్మ అనాథ ట్రస్టులో చేరింది. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వరలక్ష్మి ఆదివారం మృతి చెందింది. ఈ క్రమంలో ఎస్ఐ, డీడబ్ల్యూవోతో పాటు వరలక్ష్మి కూతుళ్లు, బంధువులకు ట్రస్టు సభ్యులు సమాచారం అందించారు. వారి సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ట్రస్టు నిర్వాహకులు గడ్డం తిరుమ ల, శ్రీనివాస్ దంపతులు తెలిపారు

భక్తజన సంద్రం

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

రాజన్న ఆలయంలో కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, మే 19: వేసవి సెలవులు.. అందులో ఏకాదశి పర్వదినం కావడంతో వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. దీంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, కోడెమొక్కు తీర్చుకున్నారు. క్యూలో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో కళాభవన్‌లో కల్యాణాల మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు, చండీ హోమాలు నిర్వహించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు ₹18 లక్షల ఆదాయం సమకూరగా, స్వామివారిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని రాజన్న ఆలయ అధికారులు వెల్లడించారు.

వేములవాడ: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కలెక్టరేట్: నివాళులర్పిస్తున్న నాయకులు

పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య

వేములవాడ, మే 19: తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, సొంత భూములు పేదలకు పంచిన మహనీయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి కొనియాడారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించి తనకున్న భూమిని పేదలకు పంచిన మహోన్నతమైన వ్యక్తి అని గుర్తుచేశారు. ఇక్కడ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జవ్వాజి విమల, ముక్తికాంత అశోక్, మల్లారపు ప్రశాంత్, నాయకులు గుర్రం అశోక్, ఎలిగేటి రాజశేఖర్, బాబు ఉన్నారు.

కోనరావుపేట, మే19: నిమ్మపల్లిలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జవ్వాజి విమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్, మే19: పోరాటయోధుడు సుందరయ్య వర్ధంతిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సిరిసిల్ల రూరల్, మే 19: తంగళ్లపల్లిలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీఎంలో 28మందికి కంటి ఆపరేషన్లు

బోయినపల్లి, మే 19: కొదురుపాకలోని బీసీఎం కంటి దవాఖానలో ఆదివారం 28 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు దవాఖాన వ్యవస్థాపకుడు, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డా వైరాగ్యం రాజలింగం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసిన అనంతరం ఆపరేషన్లు చేశామన్నారు. అదే విధంగా మరో 25మంది తీవ్ర సమస్యలతో బాధపడుతుండగా, వారి ఆపరేషన్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఎవరైనా కంటి సమస్యలతో బాధపడితే వెంటనే దవాఖానలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మహిళా రైతుపై కాంట్రాక్టర్ దురుసు ప్రవర్తన

సిరిసిల్ల రూరల్, మే 19: పెద్దూరు శివారులోని మెడికల్ కళాశాలలో ఐసీయూ పనుల చేపట్టారు. ఈ నిర్మాణ పనుల్లో సదరు కాంట్రాక్టర్ తనకు కేటాయించిన స్థలంలో కాకుండా, నాగుల లక్ష్మి అనే మహిళా రైతు పొలంలో అనుమతి లేకుండా మెటీరియల్ వేసి పనులు నిర్వహణకు సిద్ధమయ్యాడు. సదరు మహిలా రైతు ఆదివారం గమనించి, తన స్థలంలో వేసిన మెటీరియల్‌ను తొలగించాలని కాంట్రాక్టర్‌ను కోరింది. దీంతో ఆయన దుర్భషాలాడుతూ ఇష్టారీతిన సదరు మహిళా రైతును తిట్టాడు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ సత్యనారాయణ, రైతులు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం అప్పగింత

గోశాల సిబ్బంది నుంచి రసీదు తీసుకుంటున్న పరశురాములు

కోనరావుపేట, మే 19: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి గోశాలకు నిజామాబాద్ గ్రామానికి చెందిన ఈర్ల పరశురాములు ఆదివారం పశుగ్రాసం అందజేశాడు. రాజన్న కోడెల మేత కోసం తనవంతుగా 52గడ్డి కట్టలను కట్టించి ట్రాక్టర్ ద్వారా గోశాలకు తరలించాడు. దీంతో పశుగ్రాసం అందజేసిన ఈర్ల పరశురాములును రాజన్న ఆలయ గోశాల అధికారులు అభినందించి, స్వామి వారి ప్రసాదం అందించారు. ఇక్కడ నందగిరి నాగరాజు, లంబ తిరుపతి, ఎగ్గే మహేందర్, తదితరులు ఉన్నారు.

పండితులకే పోస్టులివ్వాలి

వేములవాడ, మే 19: పండిత ఉపాధ్యాయ పోస్టులు పండితులకే ఇవ్వాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జనపాల వెంకటయ్య కోరారు. ఇటీవల హైకోర్టు పండిత ఉపాధ్యాయ పోస్టులు పండితులకే ఇవ్వాలని, గ్రేడ్ 2 పండితులకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ తీర్పు వెలువరించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పండిత ఉపాధ్యాయల ప్రమోషన్ల ప్రక్రియను ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల విషయంలో ఉన్నటువంటి ప్రతిష్ఠంభన కోర్టు తీర్పుతో తొలగిపోయినందున ఈసీ అనుమతి తీసుకుని వేసవి సెలవుల లోనే పదోన్నతులు కల్పించాలని కోరారు.

రిజర్వేషన్లు పెంచాలి

జగిత్యాల/జగిత్యాల రూరల్, మే 19: రాష్ట్రంలో కుల గణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 48 శాతానికి పెంచుతామన్న హామీ నెరవేర్చాలని, కుల గణన చేపట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

ఇద్దరి బలవన్మరణం

వేములవాడ రూరల్/చందుర్తి, మే 19: కుటుంబ కలహాలతో జిల్లాలో ఇద్దరు వేర్వేరు చోట్ల బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలం ఏనగల్ గ్రామానికి చెందిన ఈక శేషవ్వ(45) ఇంట్లో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన శేషవ్వ శనివారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించిన అనంతరం గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి చీరకు వేలాడుతూ కనిపించింది. వారు తలుపులు పగలగొట్టి కిందికి దింపి చూడగా, అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అలాగే వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన మానువడ అనిల్(31) కొద్ది రోజుల నుంచి కుటుంబ కలహాలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

సిరిసిల్ల రూరల్, మే 19: తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. 17న బ్రహ్మోత్సవాలు ప్రా రంభం కాగా, సోమవారం ఉదయం జరి పూజ, సాయంత్రం వేళ లో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్స వం వైభవంగా నిర్వహిస్తున్నామని ప్రధాన అర్చకుడు వేణుగోపాలచారి తెలిపారు. 21న పొన్న వాహనం, 22న గజవాహనం, 23న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

రాజన్న ఆలయంలో అంతర్గత బదిలీలు

వేములవాడ టౌన్, మే 19: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో పరిపాలనా సౌలభ్యం కోసం ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేసినట్లు ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. పర్యవేక్షకుడు నాగుల మహేశ్‌కు ప్రింటింగ్, స్టేషనరీ, ఆడిట్, ఈ-టికెట్ల విభాగంతో పాటు కరీంనగర్‌లో గల కల్యాణ మండపం, దేవస్థానానికి సంబంధించిన అన్ని వసతిగదుల ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. గోశాల ఇన్‌చార్జిగా, భీమేశ్వరసదన్, పార్వతీపురం వసతిగదులు, గెస్ట్ హౌస్‌లు, గోశాల విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పర్యవేక్షకుడు గుండి నర్సింహమూర్తికి లడ్డూ ప్రసాదాల తయారీ విభాగం, గోశాల ఫీల్డ్ వర్క్ విధులు కేటాయించారు. జూనియర్ అసిస్టెంట్ ఎల్ రాజేందర్‌కు అన్ని రికార్డులు, గోశాలకు సంబంధించిన రికార్డుల పరిశీలన బాధ్యతలు కేటాయించారు. రికార్డ్ అసిస్టెంట్ పంపరి అంజయ్యకు బద్ది పోచమ్మ ఆలయంలోని టికెట్ల విభాగానికి బదిలీలు చేసినట్లు ఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

'లయన్స్' సేవా కార్యక్రమాలు

హర్షణీయం

లయన్స్ క్లబ్ బాధ్యులతో అంతర్జాతీయ డైరెక్టర్ లయన్ బాబూరావు

విద్యానగర్, మే 19: ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద సేవాసంస్థగా 107 ఏండ్లుగా పేరొందిన లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా తెలంగాణ మల్టీపుల్ ప్రాంతంలో విస్తరించిన 8 లయన్ జిల్లాల సౌజన్యంతో దాదాపు 25 వేల మంది నిస్వార్థ సేవాసింహాలు చేపడుతున్న సమాజహిత సేవా కార్యక్రమాలు హర్షణీయమని అంతర్జాతీయ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మల్టీపుల్ కన్వెన్షన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లయన్స్ కృషితో రానున్న రోజుల్లో లయన్స్ ఇంటర్నేషనల్ సభ్యత్వం 15 లక్షలు దాటుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధాన వక్తగా హాజరైన పూర్వ అంతర్జాతీయ డైరెక్టర్, గ్యాట్ ఏరియా లీడర్ లయన్ రుమాళ్ల సునీల్ కుమార్ మాట్లాడుతూ, లయన్స్ మారుమూల ప్రాంతాల నిరుపేదల కోసం నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఉచిత నేత్ర చికిత్సలు, అవసరమైన ఇతర సేవలు అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో వివిధ జిల్లాల బ్యాసర్ ప్రదర్శనలు, పెద్ద ఎత్తున సేవలందించిన లయన్స్‌కు ప్రశంసాపత్రాలు, పిన్స్ అందజేశారు. గతేడాది కాలంలో మరణించిన లయన్స్‌కు లయన్ కొండ వేణుమూర్తి నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించారు. నూతనంగా ఎంపికైన డీసీటీ/డీసీఎస్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులకు నాయకత్వ బాధ్యతల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 320జీ జిల్లా గవర్నర్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి నాయకత్వంలో అట్టహాసంగా కరీంనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్మన్ లయన్ మినేష్ నారాయణ్ టండన్, నిర్వహణ కమిటీ సభ్యులు లయన్ ఎన్‌వీ రావు, లయన్ ఎస్ కోదండరామ్ , లయన్ ఎం భద్రేశం, మల్టీపుల్ లీడర్స్ లయన్ దీపక్ బట్టాచార్జీ, లయన్ నరేందర్ రెడ్డి, లయన్ మోహన్, ఐపీఎం సీసీ లయన్ విద్యాసాగర్ రెడ్డి, డాక్టర్ గుర్రం శ్రీనివాస రెడ్డి, మల్టీపుల్ కౌన్సిల్ బాధ్యులు, వివిధ జిల్లాల డీజీ టీమ్, పీడీజీలు పాల్గొన్నారు.

పూడూర్ వంతెనపై

లారీ, వ్యాన్ ఢీ

- వ్యాన్ డ్రైవర్ దుర్మరణం
- శనివారం అర్ధరాత్రి 1.40 గంటల ప్రాంతంలో ఘటన
- జగిత్యాల-కరీంనగర్ రహదారిపై నిలిచిన రాకపోకలు

కొడిమ్యాల, మే 19: మండలంలోని పూడూర్ వంతెనపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ప్రమాదం జరిగింది. లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. కొడిమ్యాల ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన దామెర రాజేశ్వర్‌రెడ్డి (39) తన వ్యాన్‌లో పాలు, పెరుగు లోడ్ చేసుకొని నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌కు వెళ్తున్నాడు. రాజస్థాన్‌కు చెందిన లారీ జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వాష్ బేషిన్లు, బాత్రుం వెస్టర్న్ లోడ్‌తో వస్తున్నది. పూడూర్ వంతెనపైకి రాగానే లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొని బోల్తాపడ్డాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ రాజేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు వాహనాలు రోడ్డుపై పడిపోవడంతో జగిత్యాల-కరీంనగర్ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను అప్పారావుపేట మీదుగా మళ్లించారు. భారీ వాహనం తగలడంతో 11 కేవీకే కరెంట్ తీగ తెగి రోడ్డుపై పడ్డది. దీంతో కిలోమీటరూ పొడువునా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు 8 గంటలు శ్రమించి వాహనాలను క్రేన్ల సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా, రాజేశ్వర్‌రెడ్డి భార్య వనజ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ వీరం బాయి గమరపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, బ్రిడ్జిపై పడిన పెద్దగుంత కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

రుద్రంగిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చెన్నమనేని వికాస్

రుద్రంగి, మే 19: అకాల వర్షాలతో మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్నమనేని వికాస్ ఆదివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, క్వింటాల్‌కు ₹500 బోనస్, ₹2లక్షల రైతు రుణమాఫీ, ₹15వేల పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు నాం ద్యడాపు వెంకటేశ్, అల్లూరి అశోక్‌రెడ్డి, పడాల గణేశ్, అల్లూరి రవీందర్, పండుగు గంగాధర్, నేవూరి కిషన్, మోతె నితిన్ ఉన్నారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి

జగిత్యాల, మే 19: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను వేసవి సెలవులు ముగిసేలోపు పూర్తి చేయాలని ఎస్టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించగా, వారు మాట్లాడారు. గతేడాది నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసి బదిలీ అయి రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే వారికి కేటాయించిన స్థానాలకు పంపాలన్నారు. పండిత, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

గోహత్య నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

కమాన్‌చౌరస్తా, మే 19 : గోహత్య నిషేధ చట్టాన్ని వెంటనే కఠినంగా అమలు చేయాలని, ప్రతి జిల్లాలో కనీసం పది ఎకరాల స్థలంలో ప్రభుత్వమే గోశాలను ఏర్పాటు చేయాలని గోరక్ష ప్రముఖ్ విభాగ్ ఊట్కూరి ర